1993
నుండి
వెలువడుతున్నది

ఎలమి : ఊరాపి
(నందన : మార్గశిరము)

డిసెంబరు 2012

## తెలుగుజాతి పత్రిక

# నడుస్తున్న చరిత్ర

• నుడి • నాడు • నెనరు

15 రూ.




తెలుగు భాషోద్యమంలో కీలకమైన మలుపు









అన్ని రంగాల్లో ప్రభావం చూపుతున్న తెలుగు భాషోద్యమం

## సంపాదకీయం

# తెలుగు ప్రభుత్వం తెలుగుకు వ్యతిరేకమా?!

ప్రభుత్వం తలపెట్టిన ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ ఏర్పాట్ల విషయమై తలెత్తిన ఇబ్బందులను దాటి, ఎలాగైనా ఎంత ఖర్చయినా ఆ తేదీల్లోనే వాటిని 'జయప్రదం'గా జరపాలని ప్రభుత్వనేతలు నానా తంటాలూ పడుతున్నారు. పరువు ప్రతిష్ఠలకు చెందిన అంశంగా దీనిని వారు పరిగణిస్తున్నారు. ఈ సభలను జరుపుతామని ప్రకటించినప్పటినుండీ అన్నివైపులా నిరసనలే వస్తున్నాయి. వ్యతిరేక పవనాలే వీస్తున్నాయి. చివరకు ప్రకృతి కూడా సహకరించని పరిస్థితి ఏర్పడింది. వర్షాలవల్ల ఆవిలాల చెరువు ప్రాంతం చెరువుగానే తయారైంది. ఈ పరిస్థితిని డబ్బు ఖర్చుతో, మందీ మార్బలంతో, నిర్వహణాచతురతతో అధిగమించవచ్చు. కాని, భాషా సాహిత్య రంగాల్లోని వారి నిరసనల నెలా అధిగమిస్తారు? మూడు నెలలపాటు సభలను వాయిదా వేసి, ఉగాదికి జరుపుకోవడం మంచిదనీ ఈ లోపుగా అన్ని ఏర్పాట్లూ చేసుకొని, అందరినీ కూడగట్టుకొని దిగ్విజయంగా సభలను జరుపుకోవచ్చునని కొందరు అధికారులు ప్రభుత్వానికి సలహాయిచ్చారట! ఈ వ్యవధిలో తెలంగాణ సమస్య కూడా ఒక కొలిక్కివస్తే తామంతా కూడా ఈ సభల్లో పాల్గొనవచ్చునని తెలంగాణవాదులైన కొందరు లోలోపల భావించారు. భాషోద్యమకారులు కోరుతున్న నిర్మాణాత్మక నిక్కచ్చులను ప్రభుత్వం ఆమోదించితే మనం కూడా ఉత్సాహంగా పాల్గొనవచ్చునని భాషా సాహిత్య ప్రియులు కొందరు ఆశపెట్టుకొన్నారు. వారి భావనలూ ఆశలూ తప్పుకాదుగాని, ప్రభుత్వ పెద్దలు ఈ సమస్యల విషయంలో తమ మొండి వైఖరికే కట్టుబడ్డారు. డా॥ చుక్కా రామయ్య గారివంటి పెద్దలు ఎంతో ఆవేదనతో మాట్లాడుతున్నదందుకే. భాషా సాహిత్య సంఘాల సహకారం లేకుండా, ఇందరి వ్యతిరేకతలను ఎదుర్కొంటూ పోలీసుబలంతో ప్రపంచ తెలుగు మహాసభల్ని జరుపుతారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నదందుకే.

తెలుగు భాషోద్యమకారులు ప్రభుత్వం ముందుంచిన 9 నిక్కచ్చులను ఆమోదించి అమలు జరిపితే ప్రభుత్వపరంగా తెలుగుకోసం ముఖ్యంగా చేయవలసినదంతా చేసినట్లే. చట్టాలు, ఉత్తర్వుల రూపంలో, వ్యవస్థల రూపంలో ఏదికావాలో అదంతా చేసినట్లే. ముఖ్యమంత్రిగారు ఈ దిశగా ఆలోచించి, ఇందుకు అనుకూలంగా నిర్ణయం తీసుకొనగలిగితే అందరూ సంతోషిస్తారు. ఆయన కీర్తి ప్రతిష్ఠలు ఎంతో పెరుగుతాయి. తెలుగు విషయంలో ఇప్పటివరకూ పాలనాపరంగా జరిగిన తప్పులను చక్కదిద్దిన ముఖ్యమంత్రిగా ఆయన జేజేలందుకొంటారు.

తెలుగు భాషోద్యమ సమాఖ్య కోరుతున్నవేమీ కొత్తవి కాదని, వాటిని ఎవరూ వ్యతిరేకించరని, కనుక వాటిని మహాసభల్లో ప్రతిపాదించి అందరి ఆమోదాన్ని పొందితే, ఆ తర్వాత వాటి సాధనకోసం అధికారభాషా సంఘం అధ్యక్షుడిగా తన ప్రయత్నం తాను చేస్తానని బుద్ధప్రసాద్‌గారంటున్నారు. ఇన్నేళ్లుగా ఉద్యమం సాగిస్తూ ఇటీవల మూడు నెలలుగా ఆందోళన బాటపట్టి, అన్ని రంగాలవారి మన్ననను, ప్రజాభిప్రాయాన్నీ కూడగట్టి మూడు సార్లు ముఖ్యమంత్రిగారికీ తక్కిన అధికారులకూ నివేదించిన తర్వాత కూడా కనీసం మూడు నిక్కచ్చులనైనా ఆమోదించడానికి ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటని సమాఖ్య ప్రశ్నిస్తున్నది. తెలుగు భాషపట్ల, జాతిపట్ల అంకిత భావంతో ఈ మహాసభల్ని నిర్వహిస్తామని, తెలుగు వికాసం కోసమే ఇదంతా చేస్తామని ప్రభుత్వం చెప్తున్న మాటలను నమ్మేదెలా? ఇంతవరకు ప్రభుత్వాల 'రికార్డు' ఏ మాత్రం నమ్మకం కలిగించడం లేదే!

జాతి మనుగడకే కీలకమైన తెలుగురక్షణ, అభివృద్ధికోసం ఒక అభివృద్ధి సాధికార సంఘాన్నీ, మంత్రిత్వశాఖను ఇచ్చేందుకు ప్రభుత్వానికి ఏమిటి అభ్యంతరం? ఇప్పటికే నిర్వీర్యంగా ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ వంటిసంస్థలను పటిష్ఠంగా నడిపే చర్యలను తీసుకొనడానికీ, తెలుగుకు సంబంధించిన అన్ని వ్యవహారాలకు బాధ్యత వహించడానికి ఈ ఏర్పాటు అవసరమని ఎందుకు గుర్తించరు? పొరుగు రాష్ట్రాల్లో ఉన్న ఈ ఏర్పాట్లను మనం కూడా చేసుకోవడానికి ప్రభుత్వానికున్న అభ్యంతరం ఏమిటి? మన ప్రభుత్వం తెలుగుకు వ్యతిరేకి అన్న పేరును సంపాదించుకోవాలని ఉబలాటపడుతున్నదా? అలాంటి ఉబలాటం వెనుక ఉన్న ఉద్దేశాలేమిటి?

'సిలికానాంధ్ర' ఆనంద్ గారి వంటి ఆధునిక మార్కెట్, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించి సాంకేతికత శాఖా

## సంపాదకీయం

మంత్రి పొన్నాల లక్ష్మయ్యగారి సహకారంతో మండలి బుద్ధప్రసాద్ గారు తనకు ఏ అధికారాలూ లేనప్పుడే కృషిచేశారు. అంతర్జాలం(ఇంటర్నెట్)లో తెలుగు వెలుగుల కోసం వారంతా కలిసి చేస్తున్న కృషి అందరి మెప్పునూ పొందుతున్నది. అయితే దానికి క్షేత్రస్థాయిలో తెలుగుకు కావలసిన బలాన్ని భాషాసాంస్కృతికపరంగా కలిగించేందుకు, ఉన్న లోపాలను పోగొట్టుకొని వికసించడానికి మన వ్యవస్థల్ని తీర్చిదిద్దుకోనక్కరలేదా? నేటి తరాలకు, ముందు తరాలకు కావలసినంత పట్టును, గౌరవాన్ని భాషాపరంగా మనం అందించవద్దా? విద్య, పాలన రంగాల్లో తెలుగే రాజ్యం చెయ్యాలనడం, అందుకోసం కనీస చర్యల్ని పాలనాపరంగా తీసుకోవాలనడం ప్రభుత్వానికెందుకు రుచించడం లేదు?

ఈ రాష్ట్రం తెలుగు రాష్ట్రం. ఈ ప్రజలు తెలుగువారు. వారి భాషలో వారికి పరిపాలనను, విద్యను ఎప్పటికీ అందించడం ప్రభుత్వాల కనీస బాధ్యత. అలా పొందడం ప్రజల హక్కు. అది ఒక జాతిగా తెలుగు ప్రజల అవసరం. తమ బాధ్యతను విస్మరిస్తూ, ప్రజల హక్కును కాలరాస్తూ, జాతిజనుల అవసరాన్ని గుర్తించ నిరాకరిస్తూ, వారిని ఏళ్ల తరబడీ వంచించడం పాలకవర్గాలకు అలవాటైపోయింది. అదేమిటంటే మొత్తం నెపాన్ని ప్రజలమీదకు నెట్టడం ఒక సరదాగా మారింది. ఈ యాభైఏళ్లలో - మరీ ముఖ్యంగా గత ఇరవై ఏళ్లుగా భాషా సాంస్కృతికపరంగా జాతి స్వాభిమానాన్ని కోల్పోయే విధానాల్ని అమలుచేస్తూ, ఇప్పుడు ప్రజల్నే బోనులో నిందితులుగా నిలబెట్టాలని ప్రయత్నించడం మన పాలకవర్గాలకే చెల్లింది. నిన్నటిదాకా ఉద్యమాలతో సంబంధం ఉన్నవారు కూడా ఇప్పుడీ విధంగా మాట్లాడడం వింతగా ఉంది.

ప్రపంచ తెలుగు మహాసభల్ని జరుపుతున్న సందర్భంగా ఇదిగో జనవరి 1 నుండి - లేదా అన్ని ఏర్పాట్లూ చేసుకొని రానున్న తెలుగు ఉగాది నుండి రాష్ట్ర సచివాలయం నుండి పూర్తిగా తెలుగులోనే పరిపాలిస్తామని, ఇందుకు ముఖ్యమంత్రి, ముఖ్యకార్యదర్శి కార్యాలయాలే ఆదర్శంగా ఉంటాయనీ ప్రకటించే మాత్రం చిత్తశుద్ధీ, సంకల్పమూ లేకపోతే ఈ సభల్ని ఎవరి మెప్పుకోసం జరుపబోతున్నట్లు?

ఈ తెలుగు నేలమీద తెలుగు చదువుకొన్నవారికే ఉద్యోగాలుంటాయని ప్రకటించి అందుకు తగ్గ ఉత్తర్వుల నివ్వడానికి జంకు ఎందుకు? విద్యలో, ఉపాధికల్పనలో, పాలనలో, భాషాభివృద్ధిలో, సాంస్కృతికతలో అంతా తెలుగు నేలపై తెలుగుకే ప్రథమ ప్రాధాన్యం అనీ, తక్కిన భాషల స్థానం ఆ తర్వాతిదేననే మూలసూత్రంతో భాషావిధానం ప్రకటించడానికి ముందుకు రాని ప్రభుత్వం, ఏం ఆశించి ఈ సభలు జరుపబోతున్నదని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు.

ఈ రాష్ట్రంలో - ప్రభుత్వంలోను, బయటి సమాజంలోను ఎందరో విజ్ఞులు, పెద్దలు ఉన్నారు. వాళ్లంతా తమ పలుకుబడిని ఉపయోగించి మన ప్రభుత్వనేతలను ఒప్పించి, తగిన నిర్ణయాలను సాధించలేరా? మేధోపరమైన దివాళాస్థితికి మన రాష్ట్రం చేరుకున్నదా?

ఇప్పుడు మనం ఒక కూడలిలో నిల్చొని ఉన్నాం. రాష్ట్రం బయట మిగిలిపోయిన సగంమంది తెలుగువారు ఏమీ చేయలేని స్థితిలో కుమిలిపోతున్నారు. స్వరాష్ట్రంలో పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉంది. ఎంతో అసంతృప్తి మధ్య, వ్యతిరేకతల నెదుర్కొంటూ వందిమాగధుల తోడ్పాటుతో, అర్ధమనస్కంగా పనిచేస్తున్న అధికారవర్గం ద్వారా, పోలీసు బలగం అండ చూసుకొని ఈ సభల్ని ప్రభుత్వం జరపాలనుకోవడం అవివేకంగాక మరేమిటి?

చివరిగా ఒక్క సంగతి -

భాషోద్యమకారులను శాంతింపజెయ్యడానికి ప్రభుత్వం ఇటీవల పైపై మెరుగు పూతలు కొన్నిటిని మొదలుపెట్టింది. కొన్ని ప్రకటనలు ఇస్తున్నది. ఉన్న చట్టాలను అమల్లో పెట్టలేక, ఏదేదో వాగ్దానాలను గుప్పిస్తున్నది. అదంతా వృథాప్రయాస. ముందు మీ భాషావిధానాన్ని స్పష్టంగా ప్రకటించండి. మీ ముందున్న నిక్కచ్చులను ఆమోదించి తగిన ఉత్తర్వులనివ్వండి. అప్పుడే మీకు అందరూ జేజేలు పలుకుతారు. అలా కాకుండా, మీరు చేసేదంతా వృథా ప్రయాసే.

**03-12-2012**

సామల రమేష్‌బాబు

**ఏ రాష్ట్రంలో ఉన్నా ఏ దేశంలో ఉన్నా తెలుగువారంతా ఒక్కటే**

**చూపు**



**జయధీర్ తిరుమలరావు**

# ప్రజల మమేకత కొరవడిన తెలుగు ప్రపంచసభలు

**చరిత్ర, భాషా సాహిత్య సాంస్కృతిక రంగాల్లో అణచివేతకి గురయ్యామనే భావన తెలంగాణావాదుల్లో వ్యక్తం అవుతుంటే ఈ సభల్లో వారి ప్రమేయం మనస్ఫూర్తిగా ఉండగలదా. గత తొమ్మిదేళ్లుగా ఏమీ చేయనితనం నీడలా వెంటాడుతుంటే దాన్ని విస్మరించి సవాలు కొట్టే రీతిలో పెద్దల ప్రవర్తన మహాసభల గౌరవం పెంచుతుందా?**

ఇవ్వాళ రాష్ట్రంలో వాడి - వేడి చర్చ అంతా తెలుగు మహాసభలే. తడిసి ముద్దయిన ఆవిలాల చెరువు- వేదిక కాలేదు. ఎన్ని కోట్లు గుమ్మరించినా వానదేవు డిని జయించలేమని అధికారులు చేతులెత్తేశారు. వేదిక మార్పు కోసం నానా హైరానా పడుతున్నారు. రాజు తలచుకుంటే వేదికలకి కొదవా? ఎక్కడో ఓ చోట జాగా దొరక్కపోదు. సభ జరక్కతీరదు.

సంతోషమే.

విజ్ఞులకు ఇక్కడ ఒక సందేహం రాకమానదు. తిరుపతిలోనే సభలు ఎందుకు జరపాలి.

ముఖ్యమంత్రి జిల్లా కావడమే ఏకైక కారణమా? అలాఐతే వైఎస్ కడపో కడపా అని దేవురించిన ఆర్భాటం మనం చూశాం. చివరకు ఏమైంది. జన్మస్థలాలు, సొంతజిల్లాలు చూడాలా? ప్రపంచ స్థాయిలో జరిపే సభలకి వచ్చే అతిథులను, లక్షలాదిగా పాల్గొనే ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకోవాలా?

ఈ సభలు రాజధానిలో పెట్టమని ఎవరూ అడగరు. కాని, జీవవైవిధ్య సదస్సును మరి తిరుపతిలో జరపవచ్చుకదా. ఎందుకు జరపలేదు. ఎందుకంటే సౌకర్యాలు. అవి ప్రధానం కాబట్టి అలాగే దేశవిదేశాల నుండి తరలివచ్చే వేలాది అతిథులకి ఓమూల ఉండే తిరుపతి అదనపు దూరం కాదా. శ్రీకాకుళం నుండో, ఆదిలాబాదు నుండో వచ్చే వాళ్ళు రాలేక పోతారు కదా.

సభలకు వచ్చిన వారికి స్వామి దర్శనం అదనపు ఆకర్షణ అంటారేమో. ఏది ఏమైనా ఒక పుణ్యక్షేత్రంలో సభలు జరపడం బాగుంటుందని ప్రభుత్వం అనుకొంది. కాని అది లౌకిక భావనకి విఘాతం. తెలుగు ప్రజలు అందరూ హిందువులు కాదు. వారిలో ముస్లింలు, క్రిస్టియనులు, గిరిజనులు ఎందరో ఉన్నారు.

ప్రభుత్వం తలపెట్టే సభలు మతాతీతంగా, సకల జనామోదంగా ఉంటే మరింత ఔన్నత్యం పెరుగుతుందనడంలో సందేహం ఉండదు. సభలు విజయవంతం కావడానికి, నలుగురికీ అందుబాటులో ఉండడానికి ఏ విజయవాడో, గుంటూరో సరైన వేదిక. ఆ రెండు పట్టణాల మధ్య చక్కని స్థలం కూడా ఉంది. ఈ రెండు పట్టణాలలో బోలెడు వసతి. దేనికీ కొరత ఉండదు. తిరుపతిలో సరైన స్థలం దొరకకపోతే ఇక్కడకు మార్చవచ్చు. దీనివల్ల మరో అదనపు లాభం కూడా ఉంటుంది. అదేమంటే-

తిరుపతిలో భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో తెలుగు భాషా బ్రహ్మోత్సవాలు నాలుగైదుసార్లు వైభవంగా జరిగాయి. పలువురు పెద్దలు వాటిని ప్రశంసించారు కూడా. ఈనాటికీ వాటిని గుర్తుంచుకొంటారు. తిరుపతి మహాసభల్లో ఎలాంటి అపశృతి దొర్లినా ఒంటిచేత్తో జరిపిన ఆ సభలనే గుర్తు చేసుకుంటారు. పైగా ఆయన ఇప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్‌లో శాసనసభ్యుడిగా ఉన్నారు. కాంగ్రెస్‌పార్టీ, ప్రభుత్వం తమ అధినాయకుడిని జైల్లోపెట్టి, అష్టకష్టాలు పెడుతున్న సందర్భం. తిరుపతిలో రచయితలను, సాహిత్యసంస్థలను సమన్వయం చేయలేదింకా. రచయితల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. సభల్లో నిరసన తెలపాలనుకునేవారితో వీరు చేరే అవకాశం ఉంది. తొమ్మిది నిక్కచ్చులను నెరవేర్చకుంటే సభలను వ్యతిరేకిస్తామని, నిరసన ప్రదర్శనలను చేస్తామని తెలుగు భాషోద్యమ సమాఖ్య రెండు నెలలకిందటే ప్రకటించింది. ఇప్పటివరకు ప్రజల భాషా సాహిత్య సంస్కృతులకు సంబంధించిన ఏ ఒక్క నిక్కచ్చును నెరవేర్చలేదు.

సభల నిర్వహణ సౌలభ్యంకోసం ఒక్క అధికార భాషా సంఘం అధ్యక్ష పదవిని నింపింది. అది ప్రభుత్వం, తన అవసరం కోసమే భర్తీ చేసింది. అంతకు మించి ఈనాటి వరకు ఎలాంటి ఉలుకూపలుకూ లేదు. ఫైళ్ళు కదులుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. అవి జీవోల రూపం ఎత్తే పరిస్థితి ఎప్పుడు ఏర్పడుతుందో చెప్పలేం.

ఖజానా పరిస్థితి ఏమీ బాగోలేదని అంటూనే సభల ప్రచారం కోసమే ఐదుకోట్లు ఖర్చు పెడుతున్నారు. ఈ ప్రచారం ప్రభుత్వ అధికారులతో చేయిస్తున్నారు. ఇందులో నిజమైన సాహిత్యకారులు, సంస్థల ప్రమేయం చాలా తక్కువ. రేపు పోలీసులతో కూడా ప్రచారం చేయిస్తామన్నట్లున్నది పెద్దల స్వరం. ఇలా భాషా సాహిత్య సభలు ఏ రాష్ట్రంలోనూ జరగలేదు. అంతెందుకు ముప్పై ఏడేళ్ళకింద మండలి కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన సభలు సాహిత్యకారుల కృషివల్లే విజయవంతమైనాయి. ఇప్పుడు అధికారులు ఆ విధులను నిర్వహించడం మంచికేనా? ఆలోచించాలి.

'తెలుగు భాషా వికాసం' అంశంపై ఈటీవీ 'తెలుగు వెలుగు' కార్యక్రమం సందర్భంగా మాట్లాడుతూ అధికార భాషా సంఘానికి అధికారాలు, నిధులలేమితో కొట్టుమిట్టాడుతున్న తెలుగు విశ్వవిద్యాలయానికి అదనపు నిధులు సమకూర్చవచ్చు కదా అని అడిగితే పెద్దల నుండి సరైన సమాధానం లేదు.

ప్రభుత్వ సంస్థలకు నయాపైసా ఇవ్వకుండా తెలుగు భాషని పరిపుష్టం చేయగలరా? భాషా సాహిత్యాలను అణగారేట్లు చేస్తూ విలాసాలకు, వినోదాలకు ఆడంబరంగా డబ్బు ఖర్చు చేయడం ఏం సబబు?

ఇరవై ఐదు కోట్లు సరిపోకపోతే అదనంగా మరో ఇరవై కోట్లు మంజూరు చేస్తామని అంటున్నారు. ఖర్చుకి ఏమాత్రం వెనకాడబోమని సియం అన్నందుకు సంతోషమే. కాని, ఆ ఖర్చు ఎందుకు చేస్తున్నట్లు? స్థలం సరిచేయడానికి 90 లక్షల ఖర్చు చేయాలనడం ముందుచూపు అవుతుందా.

*రచయిత కవి, పరిశోధకుడు.*
*దూరవాణి : 99519 42242.*
jayadhirtr@gmail.com

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1368**

* * *

**Read other issues of Nadustunna Charitra @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Nadustunna+Charitra+Magazine&id=60**